# పరిష్కారం

యమ్ ఆర్కే కృష్ణ



పంతులుగారు వెళ్ళేప్పటికి పెద్దిరాజు గారు చావిడిదొడ్లో యెత్తరుగుల మీద పడకుర్చీలో కూర్చుని చుట్ట అంటించు కున్నారు. కొంచెం దూరంగా వున్న షెడ్ దగ్గర యిద్దరు మెకానిక్కులు కూర్చుని ట్రాక్టరు రిపేరుచేస్తున్నారు. తూర్పువేపున వున్న కొట్టుగదుల్లో నుండి కొబ్బరికాయలు తీసుకొచ్చి వో అరడజను మంది లారీమీదకు యెత్తుతున్నారు.

పంతులుగారిని చూడగానే రాజుగారి మీసాల చాటునుండి నవ్వు తొంగి చూసింది. నోట్లోవున్న చుట్ట తీసి "రారా పంతులూ! యేటీ రెండురోజులనుంచీ పత్తాయేలేవు. మొన్న వొత్తావు వొత్తావని పొద్దుపోయేవరకూ జూసేను. ఎంతకీ రాకపోతే అబ్బాయి దగ్గరికి అర్జంటుగా పనొచ్చి యెళ్లేవేమో అనుకున్నాను. ఎంత పనుంటే మాత్రం పంతులు చెప్పకుండా యెల్తాడా అనుకున్నాను మళ్లీ. విన్నేమో హైదరాబాదునుంచి అగ్రికల్చరోళ్ళు వొచ్చేరు. అబ్బాయి పంపాడు. ఈ సంవత్సరం చూసేవుగా దిగుబడి తగ్గిపోయింది. కాయేమో వాసైపోయింది విన్నంతా అళ్ళకి తోట చూపించటం సరిపోయింది. ఆళ్ళేం చెపుతారో తెలీదుగాని యేం రోగాలో అర్థంకావడం లేదు చెట్లకి మనుషులకి. ఇదిగో అసలు సంగతేటో కనుక్కు రమ్మందామని యెవర్నన్నా పంపుదా మనుకుంటే నువ్వే వొచ్చేవు. మరి రెండ్రోజులు నువ్వు జేసిన రాచకార్య వేటో చెప్పరా పంతులూ" అంటూ ఆరిపోయిన చుట్ట వెలిగించి కొసమీద

దృష్టి కేంద్రీకరించి రెండు వేళ్ళతో కొన నొక్కుతూ దమ్ములాగి తృప్తి పడ్డాక ప్రక్క కుర్చీలో కూర్చున్న పంతులుగారిని చూసేరు.

సమాధానంగా పంతులుగారు చిరు నవ్వు నవ్వి "యే వూరూ వెళ్ళలేదు. ఇంటిదగ్గరే వున్నాను" అన్నారు చిన్నగా.


"ఇంటి దగ్గరుండి పెద్దిరాజూ, పంతులూ రెండ్రోజులు కలుసుకోకుండా వున్నారా! భూమి తిరగబడద్దేమో చూడు" అని తోసినోరుతో బిగ్గరగా నవ్వి ముందువాల్లోకి అరుగుమీద కిటికీ లోంచి చూస్తూ "వారేయ్ యెవర్రా! పంతులుకి మజ్జిగ పట్రాండి" అంటూ కేకవేసారు.

పెద్దిరాజుగారికి డెబ్భయి దాటి ఐదేళ్ళయింది. పంతులుగారు అరవైకి దగ్గర పడుతున్నారు. వాళ్ళ స్నేహానికి నాలుగు పదులు నిండాయి. దేశం కోసమే వాళ్ళద్దరూ కలిసేరు. ఇప్పుడు కాదు కాని మొదట్లో వాళ్ళిద్దరూ కలిసి తిరుగుతుంటే వూళ్ళోవాళ్ళకి అబ్బురంగా వుండేది. స్వరాజ్యం స్వరాజ్యం అంటూ పెద్ది రాజుగారు తిరుగుతుండే రోజుల్లోనే ఆయన సలభయ్యోపదిలో పడ్డారు. స్కూలు చదువు పూర్తిచేసిన పంతులు గారు తల్లిదండ్రుల మాట లెక్కచెయ్యకుండా పెద్దిరాజుగారిని మొదటిసారిగా కలుసుకున్నపుడు ఆయన వయసు రెండు పదులు దాటలేదు. అనాడే యెన్నో యేళ్ల పరిచయమున్నట్టు యిద్దరూ కలిసి పోయారు. ఇద్దరూ కలసి సత్యాగ్రహాలు చేసేరు. జైలుకి వెళ్లేరు. జైల్లో తన రేషను కూడ పంతులుగారి కిచ్చి పెద్ది రాజుగారు కుర్రవాడి ఆకలి తీర్చేవారు.

స్వతంత్ర్యం వొచ్చిన నాలుగైదేళ్లకే యిద్దరి వుత్సాహం నీరుగారిపోయింది. దేశసేవ పేరుతో పెరిగిపోతున్న అవినీతి, లంచగొండితనం చూసి ఆ రంగం నుండి యిద్దరూ కూడపలుక్కుని తప్పుకున్నారు. వూరిలో పెరిగిపోతున్న మురా రాజకీయాలకు చేయగలిగింది లేక బాధపడేవారు.

తండ్రి పేరు చెప్పుకుని రాజుగారి కొడుకులు రాజకీయాల్లోకి దిగేరు. ఆ పలుకుబడితో పర్మిట్లు, లైసెన్సులు సంపాదించి వ్యాపారంలో లక్షలు గడించేరు. ఓ కొడుకు ఢిల్లీ రాజకీయాలు చూసుకుంటే వో కొడుకు రాష్ట్ర రాజకీ యాలు కాచుకుంటాడు. పెద్దిరాజుగారు మాత్రం ఆ వూరిలో యాభైయెకరాల కొబ్బరితోటా, పాతికెకరాల పల్లం వ్యవ సాయం చూసుకుంటూ కాలం గడుపు తున్నారు.

వంశాన్ని వుద్ధరిస్తాడనుకున్న కొడుకు బ్రహ్మణికాన్ని మంటకలిపి జైల్లో కూర్చున్నాడన్న బెంగతో పంతులుగారి తల్లితండ్రులు క్రుంగిపోయారు. పంతులుగారు పూర్తిగా స్థిరపడకుండానే వొకరితరువాత వొకరు యీ లోకం



వొదలిపోయారు. ఆ తరువాత పిల్లాడ్ని కని పురిట్లోనే ఆయన భార్యకూడ కన్ను మూసింది. తరువాత పిల్లనిస్తామని యెంతమంది వొచ్చినా ఆయన కాదన్నారు. కొడుకుని మొగపిల్లలు లేని చెల్లెలి దగ్గర పెట్టి పెంచేరు. మిగిలిన నాలుగెకరాల పొలం చూసుకుంటూ, బడికిపోయి చదువుకోడానికి సావకాశం లేని పదిమంది పిల్లలకు, పెద్దలకు రోజూ వో గంటసేపు ఉచితంగా చదువు చెప్పుతూ కాలం వెళ్ళబుచ్చుతున్నారు.

వయసు మీదపడి ముసలితనం పెద్దిరాజుగారిని కప్పేసినా పంతులుగారు ధృఢంగానే వుంటారు. మనసులోని ఆలోచనలూ, బాధలూ సొంత కొడుకులతో పంచుకోకపోయినా యిద్దరూ వొకరికొకరు చెప్పుకుంటుంటారు. పెద్దిరాజుగారిని ఆ ప్రాంతంలో "రాజయ్యా!" అని పంతులుగారు తప్ప యెవరూ పిలవలేరు.

"ఏరా పంతులూ" అని పెద్దిరాజు గారే పిలువగలరు పంతులుగారిని.

మజ్జిగ త్రాగి గంభీరంగా ఆలోచిస్తూ కూర్చున్న పంతులుగారిని చూసి "యేరా పంతులూ! ఆలోచనేటి. మనసులో మాట చెప్పు. రాజయ్య దగ్గర దాపరికాలు కూడానా. మంత్రసాన్ని చూసి కవనని మొండికేసి కూర్చున్న మాతల్లి లాగ కూర్చున్నావు" అని నవ్వేరు రాజు గారు.

పంతులు గారు కూడా నవ్వుతూ "నీ దగ్గర దాపరికం యేఁవిటి? ఎలా మొదలెట్టాలా అని ఆలోచిస్తుంటేను. నువ్వు యేమంటావోనని భయంగా వుంది" అంటూ కళ్లు మూసుకున్నాడు.

ఆయన కళ్ల ముందు రెండ్రోజుల నాటి దృశ్యం కదలాడింది.

పొద్దుపోయేక వొచ్చిన వాళ్లకు నాలుగు ముక్కలు చెప్పి పంపించి పెరట్లో మంచం వేసుకుని మంచి నీళ్లచెంబు, గ్లాసూ ప్రక్కన పెట్టుకున్నారు. కృష్ణా. ముకుందా అనుకుని పడుకోబోతుండగా ప్రక్క పెరట్లో నుండి సుడిగాలిలా వొచ్చాడు సంగమేశ్వర శాస్త్రి పెద్దకూతురుని దరబర యీడ్చుకుంటూ. వొస్తూనే పంతులుగారి కాళ్లదగ్గర పడేసాడు. ఆ అమ్మాయి ఆయన కాళ్లు రెండూ పట్టుకుని భోరుమంది. వెనకే పరుగులాంటి నడకతో శాస్త్రి భార్య వొచ్చింది.

"ముదనష్టపు ముండా! మా పాలిట శనిలా దాపురించావే. మమ్మల్నందర్నీ నీ పొట్టన పెట్టేసుకుని నీ సుఖం చూసుకోవవలసిందే జెష్టముండా. నన్ను నలుగురిలో తలెత్తుకోకుండా చేసేవే పాపిష్టి దానా. నువ్వు నూతిలోదూకి మా కొంప ముంచేయడం కాదే నేనే నిన్ను చంపేసి యింటికి నిప్పంటిచేస్తా. ఒక్క దెబ్బతో అందరం పోతాం. పీడ విరగడై పోతుంది." అని తిడుతూ ఆవేశం ఆపుకోలేక కూతురుని కాలితో తన్నుతూ జుట్టు పట్టుకుని గుంజసాగేడు.

ఈ హఠాత్సంఘటనకు విస్తుపోయిన పంతులుగారు తేరుకుని దెబ్బలు తింటున్న అమ్మాయిని శాస్త్రిగారినుండి విడదీసి 'శాస్త్రీ' అని బిగ్గరగా అరిచేరు. ఈలోగా శాస్త్రి భార్య కూతురుని మంచానికి అటు వైపుకి తీసికెళ్లింది. ఈ లోకంలోకి వొచ్చినట్టు శాస్త్రి వొక్క నిముషం శూన్యంలోకి చూసి క్రింద మట్టినేల మీద కూర్చుండిపోయి తలపట్టుకొని యేడ్వసాగేడు.

ఇంతలో శాస్త్రి మిగిలిన కుటుంబమంతా వొచ్చి అక్కడ చేరి మౌనంగా చూడసాగేరు.

ఇదంతా యేఁవిటో అర్థంకాక శాస్త్రి భార్య వైపు చూస్తూ "ఏఁవిటమ్మా! రాత్రిపూట యిదంతా యేమిటి.? అసలేం జరిగింది. ఏమీ చెప్పకుండా పిల్లదాన్ని అలా చావబాదితే సరిపోతుందా?"

అంటూ కోపంగా అడిగేరు పంతులు గారు.

అవిడ నోట్లో పైటకొంగు కుక్కుకుని "మా ఖర్మ యేం చెప్పమంటా రన్నయ్యగారూ! ఇన్నాళ్లూ వున్నా లేక పోయినా- తిన్నా తినకపోయినా యెవరి చేతా వేలెత్తి చూపించుకోకుండా గౌరవంగా బ్రతికేం. మా బాధలు ఆ భగవంతుడికే చెప్పుకున్నాం కానీ యెవ రినీ దేహీ అని అడగలేదు. ఏ జన్మలో చేసుకున్న పాపమో యీ రూపంగా మమ్మల్ని బాధ పెడుతోంది. కన్నతల్లిని చెప్పడానికి నోరు రావడం లేదు. అయినా దేవుడులాంటివారు. మీకాక్క యెవరికి చెప్పుకుంటాం మనసులో బాధ.

"నాలుగు నెలలనాడు మీ అబ్బాయి తిలక్ బాబు వొచ్చినపుడు మా కొంపకి నిప్పంటుకున్నా యిన్నాళ్లూ కనబడ కుండా లోపల్లోపలే రగులుతూ వుంది. నిన్న తెలిసింది. ఆ నిప్పు మా కొంప కాల్చేయడానికి యెంతో సమయం లేదని. బాబూ! ఆ పాపం నా నోటితోనే చెప్పించాలా? అడముండ దీనికుండొద్దా బుద్ధి. ఒళ్లు కొవ్వెక్కి కళ్లు పొరలు కమ్మేసేయి. మా కళ్లు కప్పి మాయ చేసింది. మూడ్రోజుల ముచ్చటే చూసు కొంది కాని జీవితాంతం యేడవాలని తెలియలేదు. మొగాడికేం దర్జాగా వెళ్ళి పోయి హాయిగా వున్నాడు. దీని బ్రతుకు, దీన్ని కన్నందుకు మా బ్రతుకులు యిలా కాలిపోయాయి. నిన్న తెలిసింది. నాలుగు నెల్ల పాపాన్ని కడుపులో పెంచుకు మోస్తుందని. ఇది చేసిన నిర్వాకం దీంతో పోతుందా? దీని వెనుక యింకో నలుగురు ముండలు గొంతెమ్మల్లా యెదిగి కూర్చున్నారు. ఈ ముచ్చ బయటకు తెలిస్తే యెవరైనా మా గడప తొక్కుతారా?"

"ఆయన కోపంలో కొట్టి చావమన్నా రని యిది యేడుస్తూ కూర్చుని యిందాక చీకటిపడ్డాక నూతిలో దూకడానికి గట్టు యెక్కుతుంటే చూసి లాక్కొచ్చేం. ప్రాణాలు తీసికొంటే మాత్రం వూరు కుంటుందా లోకం శాస్త్రిగారి అమ్మాయి నూతిలో కెందుకు దూకిందని ఆరాలు తీసి మా ప్రాణాలు తీయరూ. అన్నీ తెలి సినవారు, పెద్దవారు మీరే చెప్పండి. యింటిల్లిపాదినీ కట్టకట్టుకుని చావ మంటారో లేక యీ పాపిష్టిదానికి యేదేనా మార్గం చూపిస్తారో" అంటూ చెప్పలేక ఆగింది

వింటున్న పంతులుగారికి ప్రక్కలో పిడుగు పడినట్లు అయింది. కాళ్లల్లో సత్తువలేనట్టు మంచంమీద కూలబడి పోయేరు. ఎవరో శక్తినంతా లాగేసి నట్టు ఆలోచన ఆగిపోయింది.

"ఆవిడ చెప్పేదంతా నిజమా? అబద్ధమైతే యెంత బావుండును. తను నమ్ముకున్న విలువలకు తన కొడుకే దెబ్బకొట్టడమా? అమాయాకమైన అడ

పిల్లకు ఆశలు కల్పించి తన రక్తం పంచుకున్నవాడే మోసం చేయటమా! ఓరి భగవంతుడా! ఇదంతా కల చేసేయ కూడదూ" పంతులుగారి మనసు ఆవేదన చెందింది.


చుట్టూ నుంచుని తన వైపే వింతగా ఆత్రంగా చూస్తున్న శాస్త్రి కుటుంబాన్ని చూసి కొంచెం తేరుకున్నాడు. ఓపిక తెచ్చుకుని "శాస్త్రీ! అమ్మాయిని తీసుకుని యింటికి వెళ్లు. పిల్లమీద చెయ్యి చేసుకోకు. తెల్లవారిం తరువాత యేం చెయ్యాలో ఆలోచిద్దాం" అంటూ శాస్త్రి పెద్దకూతురి వైపు చూస్తూ "అమ్మాయ్! ప్రాణం తీసుకోవడం తెలివైన పని కాదు నీకేం అన్యాయం జరగకుండా చూడటానికి ప్రయత్నం చేస్తాను. వెళ్లి విశ్రాంతి తీసికో" అనగానే శాస్త్రి లేచి మాట్లాడకుండా వెళ్లిపోయాడు.

"అన య్యగారూ! ఆ దేవుడైనా మా కన్యాయం చేసాడు కాని మీరు చెయ్యరనే ధైర్యంతోనే మా కష్టం చెప్పుకున్నాం. మా బ్రతుకులు మీ చేతిలో వున్నాయి. ఇక మీ నిష" అంటూ రెండు చేతులూ జోడించి పెద్దకూతురుని తీసుకొని వెళ్లిపోయింది వెనుక మిగిలిన ఆడపిల్లలు కదిలేరు

పంతులుగారు నీరసంగా మంచం మీదకు వాలేరు "ఇదెలా జరిగింది. ఎందుకు జరిగింది?" అన్న ప్రశ్న ఆయన మనసులో ముల్లులా గుచ్చుకో సాగింది.

బి ఇ. అయిపోగానే వుద్యోగంలో చేరేముందు వో నెలరోజులు తండ్రి దగ్గర పల్లెటూర్లో గడుపుదామని పంతులుగారి కొడుకు వొచ్చేడు. చిన్నప్పటినుండీ పట్నంలో పెరగడంవల్ల వొచ్చిన రెండు రోజులకే ఆ వూరంటే విసుగొచ్చింది. తండ్రి బాధపడ్తాడని వో వారం లెక్కపెట్టుకుంటూ గడిపి వుద్యోగం ప్రయత్నం సాకుతో పట్నం వెళ్లిపోదా మనుకుంటుండగా శాస్త్రిగారి పెద్దమ్మాయి జగదాంబతో పరిచయం అయింది. మొదటిసారి చూసినపుడు అందంగా లేదనుకున్న జగదాంబ అతనికి అవకాశం కలిసొచ్చేసరికి అప్సరవలా కనిపించింది. ఏవో పుస్తకాల్లో చదవడమేకాని పల్లెటూర్లో యిటువంటి అవకాశం యింత తేలిగ్గా లభిస్తుందని అతను కలలోకూడ అనుకోలేదు, గుండె నిండా జగదాంబలో వున్న వయసు కోరికలు, యీ జన్మకు పెళ్లి కాదుగదా, రెండుపూటలా తిండికూడా తండ్రి పెట్టలేడన్న నమ్మకమూ పట్నంబాబు విసిరిన వలలో చిక్కేట్టు చేసాయి ఆమెను. పంతులుగారి అబ్బాయి ప్రయాణం వాయిదావేసి అనంవాన్ని జుర్రుకున్నాడు.

పిల్లను చూడ్డానికి యెవరో రమ్మన్నారు కాదట్టి వెంటనే రావలసిందని మేనత్త దగ్గర్నుండి వుత్తరం రావడంతో




హఠాత్తుగా పల్లెవొదలి వెళ్లాల్సొచ్చింది పంతులుగారి అబ్బాయి. ఒక నెలలోనే అతనికి పెళ్ళిఅయిపోవడం, మావగారు యిప్పించిన వుద్యోగంలో స్థిరపడి పోవడం జరిగిపోయాయి. మూడునెలలుగా అందాల భార్యే లోకంగా వుంటున్నాడు. జగదాంబతో అనుభవం యిప్పు డతనికి గుర్తుకూడలేదు.

ఇక్కడ జగదాంబ అలానే మిగిలిపోయింది, గతస్మృతులతో కడుపులో భారాన్ని పెంచుకుంటూ.

పంతులుగారి ఆలోచనలు తెగడం లేదు. "తిలక్‌కి పెళ్లి జరుగుతున్నట్టు ఆ అమ్మాయికి తెలియదూ. ఈ వూరిలో తెలియం దెవరికి? అప్పుడే చెప్పొచ్చుగా! ఇంత బాధ వుండేది కాదు. ఇప్పు డేది దారి? అమ్మాయి బ్రతుకేం కావాలి. కడుపులో బిడ్డకూడ పెరుగుతుందంటున్నారు. తన కొడుక్కి యిద్దరు భార్యలా? శాస్త్రి కూతురుకి అభ్యంతరం లేకపోయినా అక్కడ తాళికట్టిన భార్య వొప్పుకుంటుందా కలిసి జీవించడానికి? ఏమిటీ పిచ్చి ఆలోచన. సాధ్యమయ్యే పనేనా! వీరేశలింగం దారి చూపించి యిన్నేళ్లయినా యిటువంటి ఆడపిల్లలకో జీవితం పంచుకోడానికి యెంత మంది ముందుకొస్తున్నారు? పెద్ద కూతురు పెళ్లికాకుండానే తల్లి అయితే శాస్త్రి మిగిలిన కూతుళ్లకు పెళ్లిళ్లవుతాయా? అవసరాలకు ఆదుకోలేని లోకం యిప్పుడు శాస్త్రి కుటుంబంమీద విరుచుకుపడి తన ప్రతాపం

చూపించదూ! భగవంతుడా యీ సమస్యకు పరిష్కారం చూపించు తండ్రీ!"

కొడుకుమీద విపరీతమైన కోపం వొచ్చింది. పిలిపించి ఆ చెంపా యీ చెంపా వాయించాలనుకున్నాడు ప్రయోజనం?

ఈ రెండు రోజులూ ఆలోచనలు తెగక తుఫానులో కొట్టుకుపోతున్న నావలాగే సతమతమయ్యేరు. పంతులుగారు యేం చెబుతారా అని సూర్నాడంతా యెదురుచూసిన శాస్త్రి కుటుంబానికి నిరాశ యెదురయ్యింది. అసహాయతకు దరిద్రం తోడై యింటిల్లిపాదినీ ఆ రోజంతా పస్తుంచింది.

హఠాత్తుగా తెల్లవారుఝామున పంతులుగారి మనసులో ఆలోచన తళుక్కుమంది. అది దారి చూపించే వెలుగో కళ్లుపోగొట్టే మెరుపో అర్థం కాలేదు ముందు. సమయం గడిచేకొద్దీ ఆలోచన తీవ్రరూపం దాల్చింది. పర్యవసానం దారుణమేమోనన్న సంశయం వున్నా నమ్మినది ఆచరించాలన్న పట్టుదల యెప్పుడూ వుంది. నిర్ణయం తీసుకున్న తరువాత మనసు కుదట పడింది. పెద్దిరాజుగారి అనుమతికోసం పరుగెత్తుకొచ్చేరు.

పంతులుగారు కళ్లుతెరిచి "రాజయ్యా! పెళ్లిచేసుకోబోతున్నాను. అపని నువ్వు దగ్గరుండి రెండు రోజుల్లో చేయించాలి" అంటూ నవ్వేరు.

హాస్యానికైనా సంభయ్యేళ్లుగా తలపెట్టని ఆ మాట పంతులుగారి నోట విన గానేఆశ్చర్యంతో విస్తుబోయిన పెద్దిరాజుగారికి సంగతి క్లుప్తంగా చెప్పేరు.

"కొడుకు చేసిన తప్పు తండ్రి దిద్దుకోవాలి కదా! మనవడిని కొడుకుగా పెంచుకుంటాను. అలా చూడకు. ఈ సమస్యకు యిది సరైన పరిష్కారమో కాదో నాకు తెలియదు. నాదికాని సమస్యకు పరిష్కారం చూడాల్సిన బాధ్యత నామీద పెట్టేరు" అంటూ ఆగేరు.

"మరి ఆ అమ్మాయి ..." అంటూ చెప్పబోతున్న రాజుగారిని మధ్యలోనే ఆపి "అమ్మాయివైపునుండి నేను యెక్కువగా ఆలోచించలేదేమో! అయినా యింత ఆలశ్యం జరిగాక ఆలోచించవలసింది నా గురించీ, అమ్మాయి గురించీ కాదనుకుంటాను. అమ్మాయి కడుపులో పెరుగుతున్న బిడ్డగురించీ, శాస్త్రి కుటుంబం గురించీ ఆలోచించాలి.

"ఉప్పూ కారం తింటూ వయసులో వున్న మనిషికి కోరికలుండవనీ, వుండకూడదనీ అనను. కాని కొన్ని సమయాల్లో కొంత త్యాగం చెయ్యక తప్పదు. ఆ విషయంలో నేను చూపలేని పరిష్కారం కాలం చూపుతుందేమో వేచి చూడాలి" అంటూ పంతులుగారు ఆకాశంలోకి చూసారు.

పంతులు చెయ్యబోయే పని సమంజసమా కాదా అన్న మీమాంసలోపడ్డ పెద్దిరాజు గారు మాట్లాడలేదు.

---